సాక్షి
సూర్యాపేట
మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



ముగిసిన పోలీస్ ఈవెంట్స్

పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా నల్లగొండలో నిర్వహించిన ఈవెంట్స్ సోమవారం ముగిశాయి. - 8లో



హత్య కేసులో నిందితుడి అరెస్ట్

హత్య కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37°/18°

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది రాత్రి చలి అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

మహిళా హక్కులపై పోరాడాలి



నియామకపత్రం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

హుజూర్‌నగర్: మహిళా హక్కులపై నిరంతరం పోరాడాలని సామాజిక తెలంగాణ (బీసీ) ఐక్య కూటమి రాష్ట్ర అధ్యక్షుడు పిల్లల మర్రి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పట్టణంలోని ఆ సంఘ కార్యాలయంలో మహిళా విభాగం పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా నాగమణి, ఉపాధ్యక్షురాలిగా కె జానకమ్మ, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ పద్మ, సహాయ కార్యదర్శిగా ఎం వినోద, కోశాధికారిగా జి కళ్యాణికి నియామక పత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, వితంతువులు, మహిళా హక్కులపై సభ్యులు పోరాడాలని చెప్పారు. మహిళలపై అఘాయిత్యాలు, గృహహింస తదితర ఘటనలపై వెంటనే స్పందించాలని ఆయన కోరారు. మహిళా సభ్యులకు సభ్యతం ద్వారా నియమించుకోవాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో స్వేచ్ఛ ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చైర్‌పర్సన్ బి విజయ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి




కిట్లను పంపిణీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

సూర్యాపేట : జీవనశైలి వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ కోటాచలం అన్నారు. మానసిక ఒత్తిడికి దూరంగా ఉండడం కోసం ధ్యానం ,ప్రాణాయామం లాంటివి చేయాలన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గిరినగర్ పరిధిలోని బీపీ, షుగర్ పేషెంట్లకు ఎన్‌సీడీ మందుల కిట్లను పంపిణీ చేసి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 82 వేల మందికి పంపిణీకి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రతినెల ఆరోగ్య కార్యకర్తల వద్ద ఉచిత పరీక్షలు చేసుకోవాలని , బీపీ, షుగర్ అదుపులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస రాజు, గిరినగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి శ్రీకాంత్ వర్మ, ఎన్‌సీడీ ఆర్డినేటర్ భూతరాజు సైదులు, సాంబశివరావు, భాస్కర్‌రాజు, ఏక స్వామి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి నట్టల నివారణ మందు పంపిణీ

భానుపురి (సూర్యాపేట) : జిల్లా వ్యాప్తంగా రెండో విడత గొర్రెలు, మేకలకు ఈనెల 22వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఉచితంగా నట్టల నివారణ మందులను పంపిణీ చేయనున్నట్లు జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ దామచర్ల శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 5.69 లక్షల గొర్రెలు, 8.4 లక్షల మేకలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటికీ నట్టల మందు తాగించడానికి 56 బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. . నట్టల కారణంగా జీవాలు నిరసించుకోవడం, పారుడు, ఆకలి మందగించ డం, బరువు తగ్గిపోవడంతో పెంపకందారుడు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. దీని నివా రించేందుకు ప్రభుత్వం ఏటా రెండు విడతలుగా మందులను పంపిణీ చేస్తుందని తెలిపారు.

ఏఐసీసీ మెంబర్‌గా ఆర్డీఆర్



సూర్యాపేట : ఏఐసీసీ సభ్యుడిగా మాజీమంత్రి, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి నియమితులయ్యారు. ఇప్పటికే దామోదర్‌రెడ్డి నాలుగు సార్లు ఏఐసీసీ మెంబర్‌గా పనిచేయగా.. ప్రస్తుత నియామకంతో 5వ సారి కమిటీలో స్థానం దక్కించుకున్నారు. అలాగే హాత్ సే హాత్ జూడో అభియాన్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు టీపీసీసీ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అసెంబ్లీ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌లను నియమించింది. ఇక జిల్లాలోని సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలకు భాను ప్రకాశ్‌రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గానికి ఎం.నగేష్ ముదిరాజ్, తుంగతుర్తి నియోజక వర్గానికి ఎం బాలలక్ష్మిలను టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నియమించారు. ఇందులో సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్ రెడ్డి గోషామహల్, చార్మినార్ నియోజకవర్గాలకు ఇన్‌చార్జ్‌గా నియామకం అయ్యారు. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు.

రైతులకు 'ధరణి' చిక్కులు!

- ప్రజావాణిలో భూ సమస్యలే అధికం
- ప్రతివారం దరఖాస్తులతో కలెక్టరేట్‌కు వస్తున్న బాధితులు
- పరిష్కారం కాక మళ్లీ తిరుగుతున్న వైనం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : భూ రికార్డుల ప్రక్షాళన తర్వాత భూములకు సంబంధించిన అనేక సమస్యలతో సతమతమవుతున్న రైతులకు 'ధరణి'తో కొత్త చిక్కులు వచ్చాయి. ప్రజలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏళ్ల తరబడి రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మండల స్థాయిలో రెవెన్యూ అధికారులు అందుబాటులో ఉండక, ఉన్నవారు పట్టించుకోకపోవడంతో చాలా మంది రైతులు జిల్లా కేంద్రంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి క్యూ కడుతున్నారు. జిల్లా అధికారులకైనా విన్నవించుకుంటే త్వరగా పరిష్కారమవుతాయని ప్రజావాణికి వస్తున్నామని వారు చెప్తున్నారు.

61 ఫిర్యాదుల్లో.. 38 భూ సమస్యలే..

ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సగం కంటే ఎక్కువ ఫిర్యాదులు భూములకు సంబంధించినవే వస్తున్నాయి. ప్రతి ప్రజావాణిలో వచ్చినట్లుగానే ఈ వారం కూడా భూసమస్యలపైనే ఎక్కువ భూ సంబంధిత ఫిర్యాదులు వచ్చాయి.



ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజావాణికి మొత్తం 61 ఫిర్యాదులు వస్తే అందులో 38 రెవెన్యూ శాఖవే ఉన్నాయన్నారు. ఫిర్యాదుల్లో సరిహద్దులు, భూ కొలతలు, పట్టాదారు పాస్‌బుక్స్ రాకపోవడం, రైతుకు ఉన్న భూమికంటే రికార్డుల్లో తక్కువగా ఎంట్రీ కావడం, ఆన్‌లైన్లో ఎంట్రీ కాకపోవడం వంటివే సమస్యలు ఉన్నాయి.

వచ్చిన వారే మళ్లీ..

ఫిర్యాదు దారుల్లో ఎక్కువ మంది ప్రతీ వారం వస్తున్నారు. ఒక సారి ఫిర్యాదు ఇస్తే సమస్య పరిష్కారం కాకపోవడంతో మళ్లీ వచ్చి ఫిర్యాదు ఇస్తున్నారు. కొందరైతే నాలుగైదు వారాల పాటు తిరుగుతున్నారు. అయినా సమస్యలు పరిష్కరిస్తలేరని ఉన్నతాధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



ఆత్మకూర్ (ఎస్) మండలం కందగట్ల గ్రామానికి చెందిన తమ బంధువులైన వెంకన్న కుటుంబ సభ్యులకు సర్వే నంబర్ 474లో 1954 కాస్రా పహాణి నాటి నుంచి 8.05 గుంటల భూమి ఉండేది. ధరణి వచ్చినాకా ఇప్పుడు ఆ సర్వే నంబర్‌లో 6 ఎకరాల 33 గుంటలు మాత్రమే చూపుతున్నది. ఎకరం 9 గుంటల భూమి అధికారుల తప్పిదం వలన సర్వే నంబర్ నుంచి తొలగింది. ఈ భూమిని సరి చేయాలని తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు.

– మంచాల సైదులు, జాజిరెడ్డిగూడెం

భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



తన భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుని పట్టాదారు పాసుపుస్తకం ఇప్పించాలని తుంగతూర్తి మండలం రావులపల్లికి చెందికి దివ్యాంగుడు దారం దామోదర్ ప్రజావాణిలో కోరారు. గ్రామలో సేర్వ నంబర్ 78లో ఉన్న సుమారు 3 ఎకరాల భూమికి గ్రామానికి చెందిన వ్యక్తి ఆక్రమించాడని తెలిపారు. అదే విధంగా ధరణిలో తన పేరున చూపిస్తున్న భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు ఇప్పించాలని కోరారు.

– దారం దామోదర్, రావులపల్లి, తుంగతూర్తి

ప్రజావాణిలో కలెక్టర్ మార్క్

- వెబెక్స్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారం

ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఎస్. వెంకట్రావు ప్రజావాణిలో నూతన విధానాన్ని తీసుకొచ్చి తన మార్కు చూపుతున్నారు. ప్రజావాణికి వచ్చే ఫిర్యాదుదారులు సమస్యలను వేగవంతంగా పరిష్కారం చేయడానికి వెబెక్స్ విధానాన్ని అమలు చేస్తున్నారు. దరఖాస్తుదారులు ఫిర్యాదు స్వీకరించి వెంటనే ఆన్‌లైన్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి ఫిర్యాదు స్థితిగతులను, గతంలో ఏమి జరిగింది అనే విషయాలను తెలుసుకుంటున్నారు. సమస్యలను పరిష్కరించాలని ఆదేశిస్తున్నారు. ఈ విధానంతో కింది స్థాయి అధికారుల్లో మార్పు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కాగా సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ఎస్. వెంకట్రావు, ఆదనపు కలెక్టర్లు పాటిల్ హేమంత కేశవ్, యస్. మోహన్‌రావులతో కలసి పాల్గొని అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఫిర్యాదు దారుల సమస్యలను వెంటనే పరిష్కారం కాబడాలని ఆదేశించారు. కార్యాక్రమంలో జెడ్పీ సీఈఓ సురేష్, డీఎఫ్ఓ సతీష్, పీడీ కిరణ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, డీఈఓ అశోక్, డీఏఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్ గౌడ్, పీడీ ఐసీడీఎస్ జ్యోతి పద్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వెబెక్స్ ద్వారా మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్



విద్యుత్ దీపాల వెలుగులో యాదాద్రి లక్ష్మీనర్సింహా స్వామి ప్రధానాలయం

బ్రహ్మోత్సవ శోభ

నేటి నుంచి యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాలు

- ఉదయం 10 గంటలకు ప్రారంభం
- ముస్తాబైన ప్రధానాలయం
- విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలతో అలంకరణ



యాగశాలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

యాదగిరిగుట్ట : అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. స్తంభోద్భవుడిగా విరాజిల్లుతున్న యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. స్వస్తీ శ్రీ శుభకృత్ నామ సంవత్సరం ఫాల్గుణ శుద్ధ పాడ్యమి రోజు మంగళవారం నుంచి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. మార్చి 3వ తేదీన ఫాల్గుణ శుద్ధ ఏకాదశి శుక్రవారం రోజున శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఆలయ పునర్నిర్మాణం నేపథ్యంలో ఆరేళ్ల పాటు బాలాలయంలో బ్రహ్మోత్సవాలు జరిగాయి. ఈసారి కొండపై శ్రీస్వామి సన్నిధిలో వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, అరటి, మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. ఘాట్ రోడ్డు ఆలయ పరిసరాల్లో విద్యుత్ లైట్‌లు వేశారు. యాదగిరిగుట్ట పట్టణంలోనూ శ్రీస్వామి, అమ్మవారి ఆర్చిలను ఏర్పాటు చేశారు.

విశ్వక్సేన ఆరాధనతో..

బ్రహ్మోత్సవాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రధానాలయంలో శ్రీవిశ్వక్సేన ఆరాధన, స్వస్తివాచనం, రక్షాబంధనంతో ప్రధానాలయంలో మొదలుకానున్నాయి. మార్చి 3న ఉదయం అష్టోత్తర శతఘటాభిషేకం, రాత్రి 9 గంటలకు శ్రీస్వామి వారి శృంగార డోలోత్సవంతో పరిసమాప్తం కానున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన శ్రీస్వామి, అమ్మవార్ల ఎదుర్కోలు ఉత్సవం 27న, తిరు కల్యాణం 28న, దివ్య విమాన రథోత్సవం మార్చి1న నిర్వహించనున్నారు. 23వ తేదీ నుంచి అలంకార, వాహన సేవలకు ఆచార్యులు శ్రీకారం చుడతారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఆధ్యాత్మిక, ఆహ్లాదం పంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉదయం 9నుంచి రాత్రి 10గంటల వరకు కొండపైన, వీఐపీ పార్కింగ్ వద్ద ఆలయం ఆధ్వర్యంలో, సాయంత్రం 6నుంచి 9గంటల వరకు బ్రహ్మోత్సవ మండపం వద్ద వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన వేదికలను సిద్ధం చేస్తున్నారు.

ప్రథమ ప్రాకార మండపంలో సేవల అలంకరణ

బ్రహ్మోత్సవాల్లో ప్రధానమైనవి అలంకార, వాహన సేవలు. ప్రథమ ప్రాకారంలోని ఉత్తర దిశలో ఉన్న మండపంలో శ్రీస్వామి వారిని అలంకరించి సేవలను ఉత్తర రాజగోపురం నుంచి మాఢ వీధుల్లో ఊరేగిస్తారు. తూర్పు రాజగోపురం ఎదుట ఏర్పాటు చేసే వేదిక వద్ద శ్రీస్వామి వారి అలంకార సేవను అధిష్టింపజేసి ఆచార్యులు, పారాయణీకులు, రుత్వికులు పారాయణాలు పఠిస్తారు. అదే విధంగా అద్దాల మండపం ఎదుట యాగశాల ఏర్పాటు చేస్తున్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ధ్యేయం



చిరువ్యాపారులకు చెక్కులు అందజేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

- రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట : పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం మార్కెట్ యార్డులో జిల్లా షెడ్యూల్ కులాల సేవా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు. అన్ని వర్గాల వారికి అండగా ఉంటూ సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఒక మార్పుకు శ్రీకారం మొదలైందని అట్టడుగునా ఉన్న దళితుల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఇతర దేశాలు కూడా ఆశ్చర్యపోతున్నాయన్నారు. నిచ్చెన మెట్ల వ్యవస్థను రూపుమాపి ప్రజలలో సామాజిక మార్పులు తెచ్చిందన్నారు. దళిత సామాజిక వర్గాన్ని సరైన గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో దళిత బంధు పథకం ప్రవేశట్టిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత మహిళలకు అన్ని రంగాల్లో అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఇచ్చిన పైసాను పాదుపు చేసి అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ గోపగాని వెంకట నారాయణగౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ లలిత ఆనంద్, డీఆర్ఓ రాజేంద్ర కుమార్, జెడ్పీటీసీలు, ఎంపీపీలు పాల్గొన్నారు.

ఖాతాల మహోత్సవాన్ని వినియోగించుకోవాలి

భానుపురి (సూర్యాపేట) : దేశవ్యాప్తంగా పోస్ట్ ఆఫీసుల్లో నిర్వహిస్తున్న ఖాతాల మహోత్సవాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ వడ్లమూడి వెంకటేశ్వర్లు కోరారు. సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను తెరిచేందుకు ఈ ఐదు రోజులపాటు అన్ని పోస్ట్ ఆఫీస్‌లలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. 30 వేల పోస్టల్ ఖాతాలను తెరవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

వడ్డీ బకాయిలు చెల్లించాలని ధర్నా

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ బకాయిలను చెల్లించాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. ప్రతి నెల మహిళలు వడ్డీతో సహా అప్పు చెల్లిస్తున్నారని తెలిపారు. మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వాలని, అభయ హస్తం పెన్షన్ తిరిగి అమలు చేయాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ శ్రీదేవికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షులు చంద్రకళ,



నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

జిల్లా కోశాధికారి జయమ్మ, ఉపాధ్యక్షురాలు రేణుక, నాయకులు పద్మ, శ్రీదేవి, బుజ్జి, వెంకటమ్మ, హేమలత ,యాదమ్మ, గౌరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాలనకు సాంకేతికత జోడు

- ప్రభుత్వం కార్యాలయాల్లో ఈ-పాలనకు కసరత్తు
- 26నుంచి కలెక్టరేట్‌లో శ్రీకారం
- మార్చి 1 నుంచి అన్ని జిల్లా కార్యాలయాల్లో..
- ఫైల్ ట్రాకింగ్ విధానంతో పారదర్శకత

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో సాంకేతిక కార్యకలాపాలు పెరిగిపోయాయి. పాలన వికేంద్రీకరణకు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయగా, ప్రజల ముంగిటకు పాలన తీసుకొచ్చేందుకు పలు సంస్కరణలు తీసుకొస్తున్నారు. జవాబుదారీతనాన్ని పెంచేందుకు, పారదర్శక పాలన అందించేందుకు కలెక్టర్ వెంకట్రావు జిల్లాలో ఈ- పాలన ఏర్పాటుకు నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఈ- పాలనకు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

ముందుగా కలెక్టరేట్‌లో..

ప్రజలకు సకాలంలో అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించే అధికారులు సక్రమంగా హాజరయ్యేందుకు కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని ఇప్పటికే ప్రవేశపెట్టారు. సిబ్బంది పనితీరు, వారిపై పర్యవేక్షణ, ప్రజా సమస్యలు సత్వర పరిష్కారానికి అడుగులు వేశారు. ఈ క్రమంలోనే ఈ నెల 26 నుంచి జిల్లా కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలో ఈ- పాలన కొనసాగించాలని నిర్ణయించారు. అదే విధంగా మార్చి 1 నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న అన్నిశాఖల జిల్లా కార్యాలయాలు, రెవెన్యూ డివిజన్ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో ఈ- పాలన కొనసాగించాలని నిర్ణయించారు. అదే విధంగా ఏప్రిల్ 1 నాటికి మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు ఈ- పాలన విస్తరించాలని నిర్ణయించారు.



ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు..

పాలనలో రికార్డులు ఎంతో కీలకం. కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల నుంచి పాలనాధికారి, సంయుక్త పాలనాధికారి, డీఆర్వోకు నిత్యం ఎన్నో రికార్డులు పంపిస్తుంటారు. అత్యవసర సమయంలో పంపిన దస్త్రం అవసరం ఉండాల్సి రావడంతో ఎక్కడ ఉందో తెలియని పరిస్థితి. దీంతో పాటు సంబంధిత దస్త్రం ముందుకు కదలడంలో జాప్యం నెలకొంటుంది. అధికారులు చెప్పే సాకులకు చెక్ చెప్పేందుకు ఫైల్‌ట్రాకింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనిద్వారా సంబంధిత కార్యాలయం నుంచి పాలనాధికారి లేదా సంయుక్తపాలనాధికారి, డీఆర్వోకు పంపే ముందు రికార్డుపై బార్ కోడ్‌తో కలిగిన స్టిక్కర్‌ను వేసి స్కానింగ్ చేస్తారు. ఈ మేరకు ఆయా శాఖల అధికారులకు లాగిన ఐడీ, పాస్‌వర్డ్‌ను కేటాయించారు. ఆయా శాఖల నుంచి ఎన్ని రికార్డులు వచ్చాయనే విషయం పాలనాధికారి, సంయుక్త పాలనాధికారి, డీఆర్వో తెలుసుకునే వీలుంది.

26న ఈ- పాలన ప్రారంభం

- కలెక్టర్ వెంకట్రావు

కలెక్టరేట్‌లో ఈ- పాలన సేవలను 26నుంచి ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ వెంకట్రావు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు కలెక్టర్‌లు యస్.మోహన్‌రావు, పాటిల్ హేమంత్ కేశవ్‌లతో కలిసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ఆఫీసులలో ఈ- పాలన ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటగా ఈ నెల 26న కలెక్టరేట్‌లో, మార్చి 1నుంచి ఆర్డీవో కార్యాలయాలు, జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలలో ఈ-పాలన సేవలు విస్తరణ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. నెల రోజుల అనంతరం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యలయాల్లో ప్రారంభం అవుతుందన్నారు. ఇందు కోసం జిల్లాలోని అధికారులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ ఆఫీస్ కొరకు ప్రతి కార్యాలయంలో రెండు కంప్యూటర్లు, స్కానర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వైభవంగా స్వామివారి రథోత్సవం

మేళ్లచెరువు : మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి దివ్య రథోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు..ఈ దివ్య రథానికి హుజూర్‌నగర్, కోదాడ ఎమ్మెల్యేలు శానంపూడి సైదిరెడ్డి, బొల్లం మల్లయ్య యాదవ్‌లు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు ,మంత్రోచ్చారణల మధ్య రథాన్ని ఉత్తర ద్వారం వద్ద ఉంచి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు కొంకపాక విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మల పర్యవేక్షణలో రథబలి కార్యక్రమాలు నిర్వహించారు. పూలతో అలంకరించిన రథంపై స్వామివార్ల విగ్రహాలను కొలువుదీర్చారు. భక్తులు స్వామివారి రథానికి ఊరేగింపు నిర్వంహించి దేవాలయం వద్దకు చేర్చారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ వల్రా వెంకటరెడ్డి, సర్పంచ్ శంకర్‌రెడ్డి, ఎస్‌ఐ.సురేష్‌యాదవ్, గోవిందరెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ నేతృత్వంలోని బృందం చేస్తున్న పాదయాత్రకి మద్దతుగా సోమవారం చివ్వెంల మండలం వల్లభాపురం నుంచి కలెక్టరేట్ వరకు పంచాయతీ వర్కర్లు పాదయాత్ర చేశారు. అనంతరం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో 475 గ్రామ పంచాయతీల్లో 1,745 మంది కార్మికులు మల్టీ పర్పస్ వర్కర్లుగా 2018 నుంచి పని చేస్తున్నారని, ప్రభుత్వం అందిస్తున్న రూ. 8,500లతో పూట గడవని పరిస్థితి ఉందన్నారు. మూడు నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. కనీస వేతనం నెలకు రూ. 2600 రూపాయాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సోమపంగి రాధాకృష్ణ, శ్రీను, ఎం రాంబాబు, సైదులు, చిమట నాగరాజు, సురేష్, వెంకన్న, భిక్షం , సుందరయ్య, సాయి కుమార్ పాల్గొన్నరు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జీపీ కార్మికులు

క్లుప్తంగా

భక్తులకు అనుగుణంగా బస్సులు

యాదగిరిగుట్ట: యాదాద్రి వార్షిక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో జంట నగరాల నుంచి యాదగిరిగుట్టకు వచ్చే భక్తులకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని డిపో మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన మాట్లాడారు. జంట నగరాల భక్తుల కోసం ఉప్పల్ క్రాస్ రోడ్డు నుంచి నేరుగా యాదాద్రి రింగ్ రోడ్డులోని నూతన బస్టాండ్ వరకు బస్సులను భక్తులకు అనుగుణంగా ప్రతి 15 నిమిషాలకు ఒకటి నడిపిస్తామన్నారు. ఇక బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా శ్రీశైలం, వేములవాడ, కొమురవెల్లి ప్రాంతాల నుంచి బస్సులను నడిపించనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం 83 బస్సులు యాదగిరిగుట్ట డిపో పరిధిలో నడుస్తున్నాయని, వీలైనంత వరకు భక్తులకు ఇబ్బందులు లేకుండానే బస్సులను నడిపిస్తామన్నారు. ఇక రింగ్‌రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి కొండపైకి నిత్యం బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ప్రధాన ఘట్టా లైన ఎదుర్కోలు, తిరు కల్యాణం, రథోత్సవం రోజు ప్రతి 10 నిమిషాలకు ఒక్క బస్సును నడిపే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

రాష్ట్రాన్ని దివాలా తీయించిన కేసీఆర్



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట): సంక్షేమ పథకాల పేరుతో ఓ వైపు ప్రజలను మోసం చేస్తూనే మరోవైపు రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ దివాలా తీయించారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం రాత్రి మండల పరిధిలోని మక్త కొత్తగూడెం, బొప్పారం గ్రామాల్లో ప్రజాగోస బీజేపీ భరోసా పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో బీజేపీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. కేంద్రం నిధులు ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పథకాలు పేర్లు మార్చి దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో పాదయాత్ర నిర్వహించి బీజేపీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, సంద్యాల సైదులు, మన్మధరెడ్డి, అబీదు, వీరేందర్, గంగయ్య,మమతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుహల్లో కొలువై.. భక్తులకు నెలవై

- యాదవ మహర్షి తపస్సుతో యాదాద్రిపై కొలువుదీరిన నృసింహుడు

యాదగిరిగుట్ట: ఎక్కడైనా నరసింహుడు రాతి గుహల్లో.. అటవీ ప్రాంతాల్లో ఉండేందుకే ఇష్టపడతాడు. అందుకే ఆ స్వామిని 'మృగ నరహరి' అని కూడా పిలుస్తారు. అహోబిలంలో హిరణ్యకశిపుడిని వధించిన తర్వాత నృసింహుడు అడవుల్లో సంచరిస్తుండగా ఆయనను శాంతింపజేయాలని బ్రహ్మాది దేవతలు లక్ష్మీదేవిని వేడుకుంటారు. దీంతో అమ్మవారు చెంచు లక్ష్మిగా యాదాద్రి ప్రాంతంలో అవతరించి నరహరిని శాంతింపజేసిందని పురాణాలు చెబుతున్నాయి. హిరణ్యకశిపుడిని చీల్చి చండాడిన నృసింహుడి చేతులు ఆదిమహాలక్ష్మిని మాత్రం అతి సున్నితంగా అక్కున చేర్చుకున్నాయి. అంతేకాకుండా యాదవ మహర్షి తపస్సుతో సింహరూపుడు పంచరూపాలతో సాక్షాత్కరించి స్వయంభుగా వెలిశారని ఈ యాదాద్రి క్షేత్రం చరిత్ర చెబుతోంది. రుష్యారాధన క్షేత్రంగానూ యాదాద్రి విరాజిల్లుతోంది. సృష్టి కర్త బ్రహ్మకే ఆయువు పోసిన బ్రహ్మాండనాయకుడు నృసింహుడని పురాణాలు ఘోషిస్తున్నాయి. నరసింహుడిని దర్శించుకున్న సృష్టికర్త బ్రహ్మ 'ఉగ్రం వీరం మహా విష్ణుం.. జ్వలంతం సర్వతో ముఖం.. నృసింహం భీషణం భద్రం.. మృత్యు మృత్యుం నమామ్యహం' అంటూ సృష్టి కార్యాన్ని ప్రారంభించాడని పండితులు చెబుతుంటారు.

పురాణాల పరంగా..

యాదాద్రికి సంబంధించి ఎన్నో ఇతిహాసాలు, రామాయణ మహాకావ్యంలోనూ ప్రస్తావన లున్నాయి. మహాజ్ఞాని విభాండకుడి కుమారుడు రుష్యశృంగుడు, అతడి పుత్రుడైన యాద మహర్షి తపోశక్తితోనే యాదగిరిగుట్ట వెలసిందంటారు. యాదుడు బాల్యం నుంచి మహావిష్ణు భక్తుడు. దేవదేవుడిని తిలకించాలన్న తపన నానాటికి పెరిగింది. అందులోనూ ఉగ్రరూపుడైన నృసింహావతారం పట్ల ఎనలేని మక్కువ కలిగింది. దైవసాక్షాత్కారం కోసం దట్టమైన అడవుల్లో తిరుగుతూ కొండజాతికి చిక్కాడు. ఆటవికులు యాదుడిని క్షుద్ర దేవతలకు బలి ఇవ్వబోతుండగా ఆంజనేయుడు ప్రత్యక్షమైనట్లు పురాణాలు చెబుతున్నాయి. కీకారణ్యంలో సింహాకార గుట్టలు ఉన్నాయని, అక్కడికి వెళ్లి తపస్సు చేస్తే స్వామి సాక్షాత్కరిస్తాడని యాదుడికి ఆంజనేయుడు సూచిస్తాడు. యాదుడి దీర్ఘకాలిక తపస్సుతో స్తంబోద్భవుడు తొలుత జ్వాలా, గంధబేరుండ, యోగానంద, ఉగ్రసింహ, శ్రీలక్ష్మీ సమేతుడిగా (పంచరూపాలతో) యాదాద్రి గుహలోనే కొలువై ఉండడంతో ఈ క్షేత్రం పంచనారసింహ నిలయంగా పురాణాలకెక్కింది. యాద రుషి కోరిక ఫలితంగా వెలసిన క్షేత్రం యాదగిరిగుట్టగా ప్రసిద్ధి చెందింది.

రక్షణగా సుదర్శన చక్రం..

తపోముద్రలో ఉన్న యాద మహర్షిని మింగేయాలని ప్రయత్నించిన ఒక రాక్షసుడిని మరుక్షణమే విష్ణుమూర్తి సుదర్శన చక్రం అడ్డుకుని వధించిందని, అప్పటి నుంచి గుట్ట చుట్టూ సుదర్శన చక్రం రక్షా కవచంగా నిలిచి ఉంటుందని భక్తుల అపార విశ్వాసం. స్వామి పుష్కరిణి సాక్షాత్తూ బ్రహ్మ కడిగిన పాదాల నుంచే పుట్టిందంటారు. ఈ పుష్కరిణిలో పుణ్యస్నానం ఆచరిస్తే శారీరక రుగ్మతలు, గ్రహబాధల నుంచి విముక్తి కలుగుతుందని అంటుంటారు. ఎంతో కాలం మరుగున పడిపోయిన ఈ క్షేత్ర మహత్యాన్ని స్థానిక గ్రామాధికారి కలలో స్వామి కనిపించి తన అవతార రహస్యాన్ని చెప్పాడని పురాణాల్లో ఉంది. హైదరాబాద్ వాస్తవ్యులు రాజామోతీలాల్ 1920లో ఆలయాన్ని నిర్మించి పూజాది కార్యక్రమాలు పునరుద్ధరించారని చరిత్ర చెబుతోంది. ఆయన హయాంలోనే పాంచరాత్ర ఆగమ శాస్త్ర విధానంతో పూజలు మొదలయ్యాయి.

- నాడు భక్తోత్సవాలు.. నేడు బ్రహ్మోత్సవాలు




పూర్వం భక్తోత్సవాలు నిర్వహిస్తున్న ఆచార్యులు (ఫైల్)




పూర్వం యాదాద్రి ఆలయానికి వెళ్లే ఘాట్ రోడ్డు (ఫైల్)

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వాతంత్ర్యం ముందు స్థానికులు మూడురోజులు భక్తోత్సవాలు నిర్వహించేవారు. స్వాతంత్ర్యం అనంతరం 1955లో తొలిసారి 11రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో యాదాద్రి కొండ పైకి మెట్ల దారి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయినప్పటికీ ఈ ప్రాంతవాసులు ఎలాగో అలా కొండెక్కి మూడు రోజుల పాటు భక్తోత్సవాలు నిర్వహించేవారు. అప్పట్లో భక్తులు నిర్వహించేవారు కాబట్టి.. వాటిని భక్తోత్సవాలనేవారు. కొన్నేళ్ల తర్వాత ఈ భక్తోత్సవాలను ఐదు రోజులకు పెంచారు. మార్గశిర మాసంలో ఆ సంబురాలు జరిగేవి. అయితే మార్గశిర మాసంలో స్వామి వారి ఉత్సవాలు జరపడం సబబుకాదంటూ అప్పట్లోనే పూజారులు కొందరు ఫాల్గుణ మాసంలో 11 రోజుల పాటు ఉత్సవాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాడ్డాక అప్పటి ఆలయ కమిటీ పెద్దలు ఆచార్యులతో సంప్రదించి 1955లో 11 రోజుల బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. నాటి నుంచి స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి.

యాదాద్రి నరసింహుడి క్షేత్రం నాడు.. నేడు



1960 సంవత్సరానికి ముందు యాదగిరిగుట్ట ప్రాంతం



2014 కు ముందు యాదగిరి క్షేత్రం ఇలా..



ఆలయం అభివృద్ధి చేసిన తరువాత ప్రస్తుతం 2023లో ఇలా..

యాదగిరిగుట్ట: యాదవ మహర్షి ఘోర తపస్సుతో కొండ గుహల్లో వెలసిన పంచనారసింహుడి క్షేత్రం దినాదినాభివృద్ధి చెందుతోంది. ఒకప్పుడు కీకారణ్యం గుట్టలో వెలసిన శ్రీస్వామికి భక్తులు నిత్యం పూజలు చేస్తుండే వారు. హైదరాబాద్‌కు చెందిన రాజామోతీలాల్ 1920లో శ్రీస్వామికి ఆగమ శాస్త్రం ప్రకారం పూజాది కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి అభివృద్ధి కోసం బాటలు వేసినట్లు చరిత్రకారులు చెబుతారు. ఆ తర్వాత ఆయా ప్రభుత్వాల హయాంలో ఇక్కడ అభివృద్ధికి తోడ్పాటునందించారని సమాచారం. అప్పటి నుంచి దినాదిన ప్రవర్ధమానంగా యాదగిరి క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తూ భక్తులకు స్వామి దర్శనం ఇస్తున్నారు. ఇక 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో యాదాద్రిని అభివృద్ధి చేసి గతేడాది మార్చి 28న ప్రధానాలయాన్ని మహా కుంభ సంప్రోక్షణతో ఉద్ఘాటన చేపట్టి భక్తులకు దర్శనం కల్పిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత, మనవడి మృతి

- టీవీఎస్ ఎక్సెల్‌పై రోడ్డు దాటుతుండగా ఢీ కొట్టిన లారీ



చిన్నబాలు (ఫైల్)



గోపిచంద్ (ఫైల్)

కోదాడరూరల్: పొలం వద్దకు వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న తాత, మనవడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండల పరిధిలోని కూచిపూడి తండా వద్ద సోమవారం చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మేళ్లచెరువు మండలం రామాంజనేయతండాకు చెందిన లకావత్ చిన్న బాలు(48) అతని అన్న మనవడు లకావత్ గోపిచంద్ (14)లు ఇద్దరు టీవీఎస్ ఎక్సెల్‌పై వ్యవసాయ భూమి వద్దకు బయలుదేరారు. ఈ క్రమంలో కూచిపూడి తండా స్టేజీ వద్ద రోడ్డు దాటుతుండగా రామాపురం క్రాస్‌రోడ్ వైపు వస్తున్న సిమెంట్ లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టి రోడ్డు పక్కకు బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో చిన్నబాలు అక్కడికక్కడే మృతిచెందగా గోపిచంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని స్థానికులు చికిత్స నిమిత్తం కోదాడకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా బాలుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గోపిచంద్ కూచిపూడిలో 8వ తరగతి చదువుతుండగా అతని సోదరుడు తలసేమియా వ్యాధితో బాధపడుతున్నట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనపై బాలు భార్య రజిని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సాయిప్రశాంత్ తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని రామాపురం ప్రధాన రహదారిపై మృతుల బంధువులు, తండావాసులు ధర్నాకు దిగారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంతోనే రెండు ప్రాణాలు పోయాయని ఆరోపించారు. న్యాయం చేసేంత వరకు ధర్నా విరమించేదిలేదని రోడ్డుపైనే కూర్చున్నారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాలకు న్యాయం జరిగే విధంగా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

భార్యపై కత్తితో దాడి చేసిన భర్త

చిట్యాల: మనస్పర్థలతో తల్లిగారింటి వద్ద ఉంటున్న భార్యపై భర్త కత్తితో దాడి చేసిన సంఘటన మండలంలోని వెంబావి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంబావి గ్రామానికి చెందిన ఈసం శేషమ్మ, లక్ష్మమ్మ దంపతుల కుమార్తె రాములమ్మ అలియాస్ సరితను ఆరేళ్ల క్రితం మునుగోడు మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన అద్దంకి సైదులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో సరిత నెల రోజుల క్రితం తల్లిగారింటికి వచ్చింది. కాగా సోమవారం మధ్యాహ్నం సైదులు తన అత్తగారి ఇంటికి చేరుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్న సరితతో గొడవ పడ్డాడు. అనంతరం ఆమెపై కత్తితో దాడి చేసి చేతులు, కాళ్లతో పాటు పలు చోట్లు గాయపరిచాడు. దీంతో ఆమె కేకలు వేయగా, చుట్టుపక్కల వాళ్లు రావటంతో సైదులు అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన సరితను చికిత్స నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని చిట్యాల పోలీసులు తెలిపారు.

ముగిసిన పోలీస్ ఈవెంట్స్

నల్లగొండ క్రైం: పోలీస్ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా నల్లగొండ పట్టణంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈ నెల 15 నుంచి నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలు సోమవారం ముగిశాయి. జిల్లా మొత్తంగా 4,049 మంది హాజరుకాగా 1,252 మంది అర్హత సాధించారు. అధిక శాతం మంది అభ్యర్థులు రన్నింగ్‌లోనే అర్హత కోల్పోయారు. గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థులు రన్నింగ్, లాంగ్ జంప్‌లో సులభంగా అర్హత సాధించారు. చివరి రోజు 848 మందికి గాను 718 మంది పాల్గొనగా 206 మంది అర్హత సాధించారు. ఈవెంట్స్‌ను నల్లగొండ జిల్లా ఎస్పీ అపూర్వరావు పర్యవేక్షించారు. పారదర్శకంగా, ప్రశాంతంగా ఈవెంట్స్ నిర్వహించామని ఎస్పీ తెలిపారు.

పురుగు మందు తాగిన వ్యక్తి మృతి

మోతె: పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మేకలపాడు తండాకు చెందిన ధరావత్ హేమ్లు (52) భార్య లక్ష్మి, కొడుకులతో గొడవపడి ఈ నెల 10న తన వ్యవసాయ పొలం వద్ద పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగభూషణం తెలిపారు.

రెడ్ల ఆత్మీయ సభను జయప్రదం చేయాలి



రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

నాగారం: రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో ఈ నెల 26న ఆత్మకూర్(ఎస్) మండలంలోని నిమ్మికల్‌లో జరిగే రెడ్ల ఆత్మీయ సభను జయప్రదం చేయాలని రెడ్డి జాగృతి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల ఉప్పల్‌రెడ్డి కోరారు. సోమవారం మండల కేంద్రంలోని రహదారి బంగ్లాలో రెడ్ల ఆత్మీయ సభ పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన విధంగా రెడ్డి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విదేశీ విద్య పథకాన్ని పేద రెడ్ల కుటుంబాలకు అమలు చేయాలన్నారు. రైతుబీమా పథకాన్ని 60 ఏళ్ల నుంచి 75 ఏళ్లకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రెడ్డి జాగృతి జిల్లా అధ్యక్షుడు సురుకంటి నర్సిరెడ్డి, నాయకులు గుంటకండ్ల ముకుందారెడ్డి, యారాల రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి ఆలయ జూనియర్ అసిస్టెంట్ మృతి

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేముల చంద్రయ్య(55) సోమవారం మృతి చెందారు. కొంతకాలంగా చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో ఆయన మరణించినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. చంద్రయ్య మృతి పట్ల ఆలయాధికారులు, సిబ్బంది సంతాపం ప్రకటించారు.

పోచంపల్లిని సందర్శించిన పూణె విద్యార్థులు



పోచంపల్లిలో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

భూదాన్‌పోచంపల్లి: చేనేత కార్మికుల స్థితిగతులను అధ్యయనం చేయడానికి సోమవారం మహారాష్ట్రలోని పూణెలోని స్లేమ్ యూనివర్సిటీకి చెందిన 13 మంది విద్యార్థులు పోచంపల్లిని సందర్శించారు. చేనేత గృహాలకు వెళ్లి చేనేత వస్త్రాల తయారీ విధానాలను తెలుసుకొన్నారు. మగ్గం నేయడం ద్వారా ఎంత ఆదాయం వస్తుంది, వస్త్రాలను ఎక్కడ మార్కెటింగ్ చేస్తారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత కార్మికుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం చేనేత సహకార సంఘాన్ని సందర్శించి అక్కడ ఇక్కత్ వస్త్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధ్యాపకులు రాజ్‌నీనా, ఫారుఖ్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో కమ్యూనికేషన్స్ అండ్ ఫైనాన్స్ కోర్సును చదువుతున్న సెకండర్ ఇయర్ విద్యార్థులు 'డిస్కవరీ ఇండియా' అనే కార్యక్రమంలో భాగంగా పోచంపల్లి సందర్శనకు వచ్చారని పేర్కొన్నారు. ఇండియాలోని వివిధ ప్రాంతాల ప్రజల జీవన విధానాలు, సంస్కృతిని అధ్యయనం చేస్తున్నామని అన్నారు. అందులో భాగంగానే అంతర్జాతీయంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు, ఇక్కడి చేనేత కళాకారుల జీవన స్థితిగతులను తెలుసుకోవడానికి వచ్చామని తెలిపారు. అధ్యయనం చేసిన అంశాలపై డాక్యుమెంటరీని కూడా రూపొందిస్తామని అన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి

మునగాల(కోదాడ): హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మునగాల సీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోదాడ డీఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని నేలమర్రి గ్రామానికి చెందిన బచ్చలకూర మదార్(50) ట్రాక్టర్ డ్రైవర్. ఇదే గ్రామానికి చెందిన బచ్చలకూర సంజీవ కూడా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా సంజీవ సొంత బాబాయి భార్య రామాంజమ్మతో మదార్ సన్నిహితంగా ఉంటున్నాడు. ఈ విషయమై పలుమార్లు సంజీవ రామాంజమ్మతో పాటు మదార్‌ను మందలించినప్పటికీ వినలేదు. దీంతో మదార్‌ను అంతమొందించాలనే నిర్ణయానికి వచ్చాడు. ఈ నెల 16న రాత్రి గ్రామంలోని చర్చి బజారు నుంచి వస్తున్న మదార్‌ను సంజీవ కర్రతో వెంబడించి సమీపంలోని పశువుల కొట్టంలో పట్టుకుని దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన మదార్‌ను కుటుంబ సభ్యులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మరుసటి రోజు మృతిచెందాడు. హతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడిని సోమవారం గ్రామంలోనే అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో మునగాల సీఐ ఆంజనేయులు, ఎస్‌ఐ లోకేష్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఘనత తెలంగాణదే



మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

- విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



పదవీ బాధ్యతలు స్వీకరిస్తున్న చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రి, ప్రజాప్రతినిధులు

నల్లగొండ టౌన్ : దేశంలో వ్యవసాయానికి 24 గంటల పాటు ఉచిత విద్యుత్‌ను ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సోమవారం నల్లగొండలోని జిల్లా వ్యవసాయ కార్యాలయంలో జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడిగా నియమితులైన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి పదవీ బాధ్యత స్వీకార కార్యక్రమానికి మంత్రి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2014 సంవత్సరానికి ముందు తెలంగాణలో వ్యవసాయ రంగం అగమ్యగోచరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన ఆరు నెలల్లోనే విద్యుత్ సమస్యకు ముఖ్యమంత్రి కేసీఆర్ పరిష్కారం చూపారన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అంటున్న ప్రధాని మోదీ తనసొంత రాష్ట్రం గుజరాత్‌లో కూడా రైతులకు ఇప్పటికే 7 గంటల విద్యుత్‌ను ఇవ్వడం లేదన్నారు. గుజరాత్‌లో వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టిన ఘనుడు నరేంద్రమోదీ అని విమర్శించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పట్ల కేంద్ర మంత్రులు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, వారి పాలనలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలు తెలంగాణలో అమలవుతున్న పథకాలు కావాలని డిమాండ్ చేస్తున్నా పట్టించుకోవడం లేదని గుర్తు చేశారు. తెలంగాణలో కరెంట్ కోతలు తెచ్చేలా నరేంద్ర మోదీ అండ్ గ్యాంగ్ కుట్రలు చేస్తోందని మండి పడ్డారు. ధాన్యం ఉత్పత్తిలో దేశంలోనే తెలంగాణ నంబర్‌వన్ స్థానానికి చేరుకుందన్నారు. రైతుబంధు సమితి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ మారిందన్నారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సుభిక్షంగా మార్చిన కేసీఆర్‌కు రైతులు అండగా నిలవాలని కోరారు. రైతుబంధు సమితి అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతుబిడ్డగా రైతుల సంక్షేమానికి పాల్పడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, ఎన్.భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, షీప్ కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, డీఏఓ వై.సుచరిత తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎస్పీ రాజేంద్రప్రసాద్, పోలీసు సిబ్బంది

సూర్యాపేటక్రైం: రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ సోమవారం పోలీస్ అధికారుల సమీక్ష సమావేశాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసుల పనితీరు, కేసుల నమోదు, కేసుల దర్యాప్తు, పోలీసు పని విభాగాల అమలు మొదలగు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎస్పీ మాట్లాడారు. వివిధ విభాగాల్లో జిల్లా పోలీసులు ఉత్తమంగా పని చేయడంతో రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు స్థానం లభించిందని, ఈ సందర్భంగా డీజీపీ అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు నాగభూషణం, వెంకటేశ్వరరెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, సర్కిల్ సీఐలు, ఆర్‌ఐలు, డీసీఆర్‌బీ, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీ సదన్‌లో అర్చకులకు బస సౌకర్యం

- దీక్షాపరుల మండపంలో కళాకారులకు భోజన వసతి ఏర్పాటు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే అర్చకులు, రుత్వికులు, పారాయణీకులకు తులసీ కాటేజీలోని లక్ష్మీ సదన్‌లో బస చేసేందుకు ఆలయాధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా లక్ష్మీ సదన్‌లో ఉన్న గదులను 100 మంది బస చేసే విధంగా శుభ్రం చేశారు. 11 రోజుల పాటు ఈ లక్ష్మీ సదన్‌లోనే ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన అర్చక స్వాములు, పారాయణీకులు, రుత్వికులు, యాజ్ఞీకులు ఉండనున్నారు. ఇక కళాకారులకు దీక్షాపరుల మండపంలో భోజన వసతి ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే ఇందులో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దీక్షాపరుల మండపంలో ఒక భాగం మిగిలి ఉండటంతో కళాకారులకు ఇందులోనే భోజన వసతి కల్పించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు.